


లత అదృష్టం.

ఆమె చేయి వూపగానే అయిదవ నంబరు బస్సు సడన్ బ్రేక్‌తో ఆగింది!

ఆ బస్సు మిస్సయితే అరగంట వెయిట్ చేయాల్సి వచ్చేది.

ఆ విషయం తెలుసు లతకు.

అదే మరో మగశాల్తీ చేయి వూపితే ఆగేదికాదు బస్సు. ఇంకా వేగంగా దూసుకుపోయేది.

-ఆ విషయంకూడా తెలుసు లతకు. అయినా ''తన అదృష్టం'' అనుకోలేదు లత. వయ్యారంగా వెళ్ళి బస్సు ఎక్కింది.

సుతారంగా కదిలింది బస్సు.

లోపల ఖాళీలేదు.

నిలుచోవటానికికూడా ఖాళీ లేదు.

సుబ్బారావు చూశాడు లతను. పాపం అనుకున్నాడు. అనుకున్నతరువాత కుదురుగా కూర్చోలేకపోయాడు. అందువలన తన సీటులోనుంచి లేచి ఆమెను కూర్చోమని ''ఆఫర్'' చేశాడు.

లత కళ్ళు సంతోషంగా మెరిశాయి.

పెదవులు ''థాంక్స్'' అన్నాయి తీయగా

సుబ్బారావు సంతోషించాడు. పొంగిపోయాడు. తబ్బిబ్బైపోయాడు!

సుబ్బారావుసీట్లో కూర్చున్నది లత. పక్కనున్న ఏడేళ్ళ కుర్రాడు మూలకి ఒదిగి కూర్చున్నాడు.

సుబ్బారావు నిలుచున్నాడు పైన ఇనుప చువ్వను పట్టుకొని.

నిలుచున్న వాళ్ళందరికీ కాళ్ళు లాగుతున్నాయి. ఇబ్బందిగా వుంది వాళ్ళకి!- సుబ్బారావుకి కాళ్ళు లాగటంలేదు. మహదానందంగా వుంది అతనికి గొప్ప ఘనకార్యం చేసిన అనుభూతి కలిగింది.

తల పక్కకు తిప్పకుండా కనుగ్రుడ్లను కదిల్చి లతవైపు చూశాడు.

అదే సమయంలో లత కూడా సుబ్బారావుని చూసింది సూటిగా. ఆ చూపు సుబ్బారావు హృదయాంతరాళాల్లోకి చొచ్చుకు

---

పామర్తి రాజేంద్ర ప్రసాద్

పోయింది.

''అబ్బ ఎంత గమ్మత్తయిన కళ్ళు... ఎంత పదునయిన చూపులు !''

ఓ క్షణంసేపు చూపు మరల్చి మళ్ళీ చూశాడు.

అదేపని చేసింది లతకూడా.

సుబ్బారావులో సంతోషం వరదలై పారింది !

''అబ్బ- ఎంత ఘాటుగా చూస్తోంది... ఆహా ఆ చూపు- ఆ క్షణం- అమూల్యం... ఆ క్షణాలనే శాశ్వతం చేస్తే... ఓహ్ ఎంత బావుంటుంది? తనవంటి అదృష్టవంతుడు మరొకడు వుండడు.

నిజంగా తనకు అంత అదృష్టం వుందా ?

ఏమో ?...

ఎవరు చెప్పగలరు ?

లేదని ఎందు కనుకోవాలి ?... చాలా సినిమాలలో హీరో హీరోయిన్లకు ఇదే విధంగా జరగటంలేదూ మొదటి పరిచయం- ఆ పరిచయం తరువాత ప్రణయం... ప్రగాఢ వలపు తరంగాలు...తరువాత పెళ్ళి !

నిజంగా ప్రేమించి పెళ్ళిచేసుకున్న వాడిదే అదృష్టం !

తనకూ ఆ యోగ్యత వున్నదేమో... ఈ సుందరితో తన పరిచయం ముందుకు పోతుందేమో ? చూడాలి !

అదిగో మళ్ళీ చూస్తోంది !

* * *

విసుగెత్తుతోంది లతకు.

గంట దాటింది, పార్కుకు వచ్చి. అయినా మాలతి రాలేదు ఎందువల్లనో ?... ఖచ్చితంగా ఆరుగంటలకు వస్తానంది. ఏదో ముఖ్యవిషయం మాట్లాడాలట. తప్పకుండా రమ్మని చెప్పింది.

ప్రతి సంవత్సరము 55000 మంది శిశువులు జన్మిస్తున్నారు. అందువల్ల - ప్రతి సంవత్సరం 13 మిలియన్ల పిల్లలకు మనం ఆహారం అందించాలి. వారి కొరకు 1.2 లక్షల ప్రాథమిక పాఠశాలల్ని నెలకొల్పవలసి వుంటుంది. 4 లక్షల మంది ఉపాధ్యాయుల్ని నియమించవలసి వస్తుంది. అదనంగా 25లక్షలగృహాలు నిర్మించాలి. 1887 లక్షల మీటర్ల గుడ్డను ఉత్పత్తి చేయవలసి వుంటుంది. 125 మిలియన్ల క్వింటాల్స్ ధాన్యం పండించవలసి వుంటుంది. అన్నింటికన్నా ముఖ్యంగా - 40 లక్షల ఉద్యోగాలు అదనంగా ప్రతి సంవత్సరం సృష్టించాలి.

కానీ తను రాలేదు.

చీకటితెరలు ముసురుతున్నాయి-

పార్కులో లైట్లు వెలిగాయి.

టైం చూసుకున్నది లత.

ఏడున్నర.

ఇహ వెళ్ళాలి తను. త్వరగా బస్ స్టాప్‌కు చేరుకోవాలి. ఆలస్యమయితే బస్సులు అందటం కష్టం.

కానీ మాలతి రాలేదే...తను వెళ్ళగానే వస్తుందేమో ?... ఆలస్యంగా రావటం మాలతికి అలవాటే. అందుకే ఒక పావుగంట చూసి వెళ్ళటం మంచిది.

పావుగంట సమయం గడిచిపోయింది.

మాలతి రాలేదు.

విసురుగా లేచింది లత. పార్కు బయటికి దారితీసింది. కొద్దిదూరం నడిచింది.

"ఏమండీ" అన్న పిలుపు విని వెనక్కు తిరిగింది.

"మీ హేండ్ బేగ్" అంటూ ఆమెను సమీపించాడు.

అతని పేరు శివరావు.

నిరుద్యోగి.

చూడగానే గమనించగలిగింది లత. నిరుద్యోగిలో వుండవలసిన లక్షణాలన్నీ వున్నాయి మరి.

"అంత అజాగ్రత్త అయితే ఎలాగండీ" నిరుద్యోగి చొరవ చేశాడు హేండ్ బేగ్ ఇస్తూ-ఆమెను గుచ్చిగుచ్చి చూస్తూ.

చూపులు కిందకు దించుకొని హేండ్ బేగ్ అందుకున్నది లత.

రెండడుగులు ముందుకు వేసింది, వెళదామని.

"ఏమండీ."

"మళ్ళీ ఏమిటండీ?" అన్నట్లు చూసింది వెనక్కు తిరిగి.

"ఏమీలేదు, వెళ్ళండి- థ్యాంక్స్ చెప్పటం మీకు అలవాటు లేదేమో..."

"సారీ... మర్చేపోయాను... మెనీ మెనీ థాంక్స్"

"ఇహిహి... వెళ్ళిరండి"

లత ముందుకు సాగింది. శివరావు అక్కడే నిలబడిపోయాడు, వెనుకనుంచి ఆమె అందాన్ని కళ్ళతో ఆస్వాదిస్తూ.

వెళుతూ వెళుతూ తల వెనక్కు తిప్పి, ఒక్కచూపు విసిరింది లత.

శివరావు గుండెలు ఝల్లుమన్నాయి.

ముందుకు సాగింది లత.

"ఆహా ... ఎంతటి భాగ్యం" అనుకొన్నాడు శివరావు.

ఆమె కనుమరుగై పోయింది. శివరావు కళ్ళల్లో ఇంకా ఆ రూపం మెదలుతోంది.

"అచ్చం తన అభిమాన రచయిత్రి నవలలోని హీరోయిన్‌లా వుంది"- నిశ్చయించుకున్నాడు శివరావు.

ఆ హీరో తనే అయితే ఎంత బావుండును?

తన శని వదిలిపోతుంది.

ఎక్కడో ఉద్యోగం చేస్తున్నట్లే వుంది వాలకం.

తన అభిమాన రచయిత్రి వ్రాసిన "అదృష్టవంతుడు" నవలలోనూ అంతే. ఇద్దరికీ పరిచయం విచిత్రంగా జరుగుతుంది.

హీరో నిరుద్యోగి.

హీరోయిన్ చిరుద్యోగిని.

హీరోయిన్ మొదట హీరోని ప్రేమించేస్తుంది. ఇద్దరికీ రిజిస్ట్రార్ ఆఫీసులో దండల మార్పిడి జరిగిపోతుంది.

దరిద్రుడయిన హీరో ధనవంతుడవుతాడు హీరోయిన్ సాయంతో. తనకూ అట్లాంటి అవకాశమే వస్తే బావుండును.

వస్తుందేమో?...

మళ్లీ ఈ దేవత రేపు వస్తుందేమో??...

* * *

లతకు భయంవేయటం లేదు. ఆమెకు చాలా ధైర్యం.

బస్‌స్టాప్‌లో లతతో పాటు ఇంకో అతను వున్నాడు. అతను-కామరాజు.

లతను కొరకొర చూస్తున్నాడు. కొరికేసేటట్లు చూస్తున్నాడు, గుడ్డి వెలుతురులో.

కొద్ది సేపటి క్రితమే కరంటు పోయింది.

అయినా షాపుల లోనుంచి పడుతోంది కొవ్వొత్తుల వెలుతురు, లతమీద. ఆ వెలుతురులో ఆమె వంపు సొంపులను పరీక్షిస్తున్నాడు కామరాజు.

మధ్యమధ్యలో ధైర్యం చేసి చాలాసార్లు-లతను సమీపించ బోయాడు. మళ్ళీ ఎందుకో ఆగి పోయాడు.

అతను పడుతున్న ఇబ్బందిని గమనిస్తూనే వున్నది లత. అయినా ఆమె చలించలేదు. అతన్ని చూడనట్లే వుండి పోయింది, బస్సు కోసం ఎదురుచూస్తూ

కొద్ది నిమిషాలు గడిచాయి.

''టైం ప్లీజ్''... కావాలనే అడిగాడు కామరాజు.

''ఎయిట్ ఫైవ్'' ఆకాశంలో మబ్బులకో, రోడ్డుమీద దుమ్ముకో చెప్పినట్లుంది సమాధానం.

కామరాజులో వుత్సాహం పరుగులెత్తింది. తన అదృష్టాన్ని పరీక్షించు కుందాం-అని నిశ్చయించుకున్నాడు.

దగ్గరలోనే వున్నది-అప్సరా లాడ్జి.

పక్కనే వున్నది అప్సరస.

ఇంతకన్నా ఏంకావాలి?... కాదంటుందా?

ఏమో... తీరా ధైర్యం చేయగానే-చెంప 'ఫెళ్ళు' మనిపిస్తే...

భరించవచ్చు... ఈ అవకాశం జారిపోతే-అమ్మో... మళ్ళీ రాక పోవచ్చు... ఇంతటి అందమయిన సుకుమారి మళ్ళీ దొరకక పోవచ్చు. నిగ్రహ పరులను సైతం రెచ్చగొట్టే వంపులున్నాయి ఈ మెలో. ఇల్లాంటి అందాన్ని అనుభవించని జీవితం వ్యర్థం! కామరాజు ఇట్లా ఆలోచిస్తూనే వున్నాడు. ఇంతలో బస్సు వచ్చింది ఆయిదో నంబరు బస్సు.




కొత్తగా కనుగొన్న అద్భుత యంత్రం
(హోమ్ సినీమా ప్రొజెక్టర్)

ఇంట్లోనే కూర్చొని రంగుల ఫిల్ములలో నృత్యాలు, నటనా సన్నివేశాలు తిలకించండి. విద్యుచ్ఛక్తి గాని, బ్యాటరీతోగాని పనిచేసే ఈ సినీమా ప్రొజెక్టర్ ఖరీదు 30 రూపాయలు మాత్రమే. పోస్టేజి ఖర్చులు రూ. 7-50 పై. అదనం. జర్మన్ మోడల్ (సూపర్) ధర 45 రూపాయలు. పోస్టేజి ఎనిమిదిన్నర. రిఫ్లెక్టర్ స్క్రీన్ 5 రూపాయలు. ఈ ప్రొజెక్టర్లలో 35 మిల్లీ మీటర్ల ఫిలిం ఉపయోగించవచ్చు. ప్రొజెక్టర్‌తోపాటు 25 గజాల ఫిలిం, ప్రొజెక్టర్‌ను ఉపయోగించే పద్ధతిని తెలిపే పుస్తకం ఉచితంగా లభిస్తుంది. అదనంగా ఫిలిం 25 పై॥కు గజం.

ఆరుషాట్ల పిస్తోలు
(లైసెన్సు అవసరంలేదు)

రష్యన్ మోడల్ ఆటోమేటిక్ పిస్తోలుతో దొంగలు, క్రూరమృగాల బారినుండి ఆత్మరక్షణ చేసుకోండి. డ్రామానటులు, సర్కస్‌వారికి కూడా మిక్కిలి ఉపయోగకరం. పిస్తోలుతో పాటు వంద తూటాలు ఉచితం. నెం. 555 పిస్తోలు ధర రూ. 14-50. డీలక్సు (నెం. 777) ఖరీదు రూ. 24. బెల్టుతో క్రోమ్ లెదర్ కేసు (సూపర్) రూ. 10. ఎక్స్ట్రా తూటాలు నూటికి 2 రూపాయలు. పోస్టేజి అదనము. ఇంగ్లీషు, లేదా హిందీలో వ్రాయండి.



Vijay Agencies
Chhapeti, Aligarh (U. P.)

లత అందులో ఎక్కింది వెంటనే.

కామరాజు నోరు తెరిచేశాడు.

లోపలికి వెళ్ళి కిటికీ పక్క సీట్లో కూర్చున్నది లత, బస్సు కదిలింది. వెళ్ళేటప్పుడు అమిత దీనంగా వున్న కామరాజు మొహాన్ని చూసింది.

వెంటనే కామరాజు మొహంలో వెలుగు వెలిగింది.

బస్సు దాటిపోయింది.

కామరాజులో వుత్సాహం చప్పగా చల్లారినా మొహంలో మాత్రం వెలుగు వెలుగుతూనే వుంది.

అయ్యో-'అవకాశం చేయి దాటిపోయింది.

'ప్చ్'-అనుకున్నాడు.

అయినా మళ్ళీ ఇంకెక్కడయినా తారసపడక పోతుందా ?...

పడితే పడవచ్చు లైన్లో'

*　　　*　　　*

పది గంటలుకొట్టింది. గోడగడియారం.

చదువుతున్న నవలను అంతటితో ఆపి వేసింది లత. పుస్తకం మూసి దిండుకింద పెట్టి వళ్ళు విరుచుకుంది.

మంచం పక్కనున్న కూజాలో నుంచి ఓగ్లాసు మంచినీళ్ళు వంచుకుని త్రాగింది.

వెలుగుతున్న లైట్‌ను ఆర్పివేసి, జీరో వోల్టు బల్బు స్విచ్ నొక్కింది.

రెండు సార్లు మంచం మీద అటూ ఇటూ దొర్లి మూడో నిమిషంలో నిద్రాదేవిని కౌగలించుకొంది?

*　　　*　　　*

కాని-

సుబ్బారావు,

శివరావు,

కామరాజు

ఆరాత్రి పక్కల మీద ఎంత దొర్లినా కళ్ళుమూతలు పడలేదు. ఎవరికి వారు-లతను తమవెంట పెట్టుకొని, వూహాలోకాల్లోషికార్లు కొట్టటం మొదలెట్టారు! *


రేపు గురించి ఈరోజే ఆలోచించండి

చదవండి

'1977 లో మీ భవిష్యత్తు తెలుసుకోండి'

అశ్వని మొదలు రేవతి దాకా గల 27 నక్షత్రాలకూ విడివిడిగా ప్రతి నక్షత్రానికి 1977 లో భవిష్యత్తు ఎలా వుంటుందో విపులంగా వ్రాయబడిన విశేష గ్రంథం.

1. కుజదోషమంటే ఏమిటో యీ పుస్తకంలో వివరించబడింది.
2. వధూవరుల జాతకాలను పరిశీలించి, గుణాలను లెక్కగట్టే పద్ధతి విశదంగా వ్రాయబడింది.
3. తెలుగు చాంద్రమాన సంవత్సరాలకు సరియైన ఇంగ్లీషు సంవత్సరాలు తెలుపబడ్డాయి.
4. ఆంధ్రదేశంలోని అన్ని తాలూకా పట్టణాలకూ సరియైన అక్షాంశ రేఖాంశలు యివ్వబడ్డాయి.

ప్రతులకు, ఏజన్సీ వివరాలకు :

అస్ట్రాలాజికల్ రీసర్చ్ సెంటర్

6-3-596/43, వెంకటరమణా కాలనీ, హైదరాబాదు-4.